సాక్షి
వికారాబాద్
బుధవారం । 1 । నవంబర్ । 2023



పరిగి బరిలో ప్రముఖులు
పరిగి నియోజకర్గంలో ఇప్పటి వరకు 14 సార్లు ఎన్నికలు జరిగ్గా మొదటిసారి కాంగ్రెస్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 10లో▸



భారీ మెజార్టీ ఖాయం
రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి భారీ మెజార్టీ ఖాయమని రోహిత్ తల్లి ప్రమోదిని ధీమా వ్యక్తం చేశారు. 11లో▸



వరి కోతలు షురూ..
వానాకాలం పంట చేతికి రావడంతో వరి కోతలు మొదలయ్యాయి. కూలీలు దొరక్క యంత్రాలను వినియోగిస్తున్నారు. 11లో▸

న్యూస్‌రీల్

ఎగ్జిట్‌పోల్స్ నిషేధం

వికారాబాద్ అర్బన్: ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎలాంటి ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించరాదని జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎగ్జిట్‌పోల్స్‌కు సంబంధించిన వార్తలను ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాల్లో ప్రసారం చేయరాదని సూచించారు. ఈ నెల 7వ తేదీ ఉదయం 6:30నుంచి నవంబర్ 30వ తేదీ సాయంత్రం 6:30 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం విధించినట్లు ఆయన తెలిపారు.

కేసీఆర్‌తోనే మైనార్టీల సంక్షేమం

ఎంపీ రంజిత్‌రెడ్డి



మైనార్టీ నాయకులతో ఎంపీ రంజిత్‌రెడ్డి

ధారూరు: మైనార్టీల సంక్షేమం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జిల్లా కోఆప్షన్ సభ్యుడు అజీమ్ ఖురేషి, పార్టీ ధారూరు ఎన్నికల ఇన్‌చార్జ్ వడ్ల నందు, ఎంఐఎం మండల అధ్యక్షుడు మోయిజ్ ఖురేషిలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. షాదీముబారక్ ద్వారా ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సాయం, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు రుణాలు మంజూరు చేశారని తెలిపారు. ఆయన రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని, ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గత ప్రభుత్వాలు మైనార్టీల కోసం చేసింది ఏమీ లేదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజు నాయక్, వేణుగోపాల్‌రెడ్డి, హఫీజ్, చంద్రమౌళి, రహమతుల్లాఖాన్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

దోమ: ఎన్నికల హామీల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యాయని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం మండలంలోని ఐనాపూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ అనేక హామీలు ఇచ్చాయని, అధికారంలోకి రాగానే వాటి గురించి పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరిగిందని, వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

ఎన్నికల విధులపై పోలింగ్ ఆఫీసర్లకు శిక్షణ



పీఓలకు సూచనలు ఇస్తున్న రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: ఎన్నికల నిర్వహణపై పోలింగ్ ఆఫీసర్లకు పూర్తి అవగాహన ఉండాలని వికారాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారి రాహుల్‌శర్మ సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవీఎంల ఓపెనింగ్, క్లోజింగ్‌పై ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా, ఐడీ కార్డులపై అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ సమయంలో సాంకేతిక సమస్యలు ఎదురైతే సెక్టోరియల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

నేతల చూపు.. యువత వైపు

యువ ఓటర్లను ఆకట్టుకునే పనిలో అభ్యర్థులు

- ఓటరు జాబితాలో 40 శాతం ఉండటమే కారణం
- అన్ని పార్టీలదీ అదే బాట
- ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్
- ఇంకా అభ్యర్థిని ప్రకటించని కమలం ప్రచారంలోనూ వెనుకంజ



తాండూరు: తాండూరు రాజకీయాలన్నీ యువత వైపే తిరుగుతున్నాయి. ప్రస్తుత ఎన్నికల్లో యువత ఓట్లే కీలకం కానున్నాయి. గత ఎన్నికల్లో యువతను అంతగా పట్టించుకోని అభ్యర్థులు ప్రస్తుత ఎన్నికల్లో వారిని ప్రసన్నం చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధాన పార్టీలన్నీ యువ ఓటర్లు ఎంత మంది ఉన్నారనే లెక్కలు కడుతున్నాయి. తాండూరు నియోజకవర్గంలో 2,28,495 మంది ఓటర్లు ఉండగా, అందులో 40శాతం వరకు 18 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన ఓటర్లు ఉన్నారు. వీరు ప్రస్తుత ఎన్నికల్లో ప్రభావం చూపనున్నందున ప్రధాన పార్టీలన్నీ ఆ ఓట్లపైనే ఎక్కువ దృష్టి సారించాయి. యువతను ఆకట్టుకునే పనిని మొదలు పెట్టాయి. నియోజకవర్గంలోని బషీరాబాద్, యాలాల, పెద్దేముల్, తాండూరు, కోట్‌పల్లి మండలాలతో పాటు తాండూరు మున్సిపల్ పరిధిలోని యువత ఎక్కువగా ఉంది. వారిని అక్కున చేర్చుకునేందుకు అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ పోటీ పడుతున్నాయి. ఇందులో భాగంగా వారిని ఆకట్టుకునేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తున్నారు.

యువత ఎటువైపు ?

2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ శాతం యువకులు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి అండగా నిలిచారు. ఆయన విజయానికి కీలకంగా పనిచేశారు. గతంలో యంగ్ లీడర్స్ సంస్థ పేరిట దశాబ్ద కాలం పాటు యువత రాజకీయాల్లోకి రావాలని ఎమ్మెల్యే పలు కార్యక్రమాలు నిర్వహించారు. యువ శక్తిని వెలికి తీయడంలో సక్సెస్ అయ్యారు. దీంతో పైలెట్ విజయానికి యువత తోడుగా నిలబడ్డారు. అయితే ప్రస్తుత ఎన్నికల్లో రాజకీయ సమీకరణలు మారిపోయాయి. యంగ్ లీడర్స్ మధ్య విభేదాలు నెలకొనడంతో సేవలకు స్వస్తి పలికారు. దీంతో సంఘటితంగా ఉన్న యువత చీలిపోయారు. ఒక్కొక్కరు ఒక్కో పార్టీలో కొనసాగుతున్నారు.

పైలెట్ ఫోకస్

ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి రెండేళ్లుగా యువతను ఆకర్షించే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని యువత కోసం టోర్నమెంట్లు, జాబ్ మేళా వంటివి చేపట్టారు.

ప్రసన్నం చేసుకునే పనిలో..

యువ ఓటర్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యాచరణను మొదలు పెట్టింది. తాండూరు అసెంబ్లీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. గతంలో ఎమ్మెల్యే పైలెట్ వెంట నడిచిన నేతలు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. ఇది మనోహర్‌రెడ్డికి కలిసొచ్చే అంశమని పలువురు అంటున్నారు. బీజేపీ అధిష్టానం తాండూరు అభ్యర్థి ప్రకటించలేదు. దీంతో ప్రచారంలో ఆ పార్టీ నాయకులు వెనుకబడ్డారు. అయితే తాండూరు పట్టణంలో బీజేపీకి యువత ఓటు బ్యాంక్ బాగానే ఉంది. అది ఆ పార్టీకి కలిసొచ్చే అంశం.



రాంనాథ్‌గుడుపల్లి ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

రైతులు ఆలోచించి ఓటేయాలి

- కర్ణాటకలో ఐదు గంటలే కరెంటు ఇస్తున్నారు
- ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రే ఈ విషయం చెప్పారు
- మనం 24 గంటల విద్యుత్ ఇస్తున్నాం
- ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

మోమిన్‌పేట: కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మి మోసపోరాదని, రైతులు అన్ని ఆలోచించి ఓటు వేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సూచించారు. మంగళవారం మండలంలోని రాంనాథ్‌గుడుపల్లి, మల్లారెడ్డిగూడెం, గోవిందాపూర్, వెల్‌చాల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలో వ్యవసాయ రంగానికి ఐదు గంటలే కరెంటు ఇస్తున్నామని, ఈ విషయాన్ని స్వయంగా ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చెప్పారని, తెలంగాణలో 24గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని, బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. రైతు బంధు పథకం మొత్తాన్ని విడతల వారీగా పెంచనున్నట్లు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ఉండి భూమి లేని నిరుపేదలకు రూ. 5లక్షల బీమా సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్లు పేర్కొన్నారు. మిషన్ కాకతీయతో చెరువులు బాగుపడ్డాయని, భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు. సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే లక్ష్యంగా సాగుతున్న బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్, ఆయా గ్రామాల సర్పంచులు జగదీశ్వర్, రాజశేఖర్, ఆశమ్మ, లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, రైతు బంధు మండల అధ్యక్షుడు అజీజ్, మండల మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యువత విభాగం మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, భిక్షపతి, మైపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

తొలగని ఉత్కంఠ

- ఎదురుచూపుల్లో కమలం శ్రేణులు
- మొదటి జాబితాలో జిల్లాకు దక్కని చోటు
- ఒక్కో నియోజకవర్గం నుంచి పరిశీలనకు రెండేసి పేర్లు
- ఇతర పార్టీలతో పోలిస్తే ఆశావహులు అధికం
- వేచి చూసే ధోరణిలో బీజేపీ శ్రేణులు



వికారాబాద్: కమలం ఆశావహులకు ఉత్కంఠ తప్పడంలేదు. మొదటి జాబితా ప్రకటించి పది రోజులు కావడంతో పాటు ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో ఆశావహుల తోపాటు పార్టీ శ్రేణులు ఆందోళనకు గురవుతున్నారు. అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించగా, బీజేపీ శ్రేణులకు మాత్రం ఎదురు చూపులు తప్పడం లేదు. 52 మందితో కూడిన మొదటి జాబితాలో జిల్లాకు సంబంధించి ఏ ఒక్క నియోజకవర్గానికి కూడా అభ్యర్థిని ప్రకటించలేదు. దీంతో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆశావహులు, పార్టీ శ్రేణుల ఉత్కంఠ మరింత ఎక్కువ అయ్యింది. అసెంబ్లీ ఎన్నికలకు కేవలం 30 రోజులే ఉండడం అయినా అభ్యర్థులను ప్రకటించపోవడం బీజేపీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తోంది. దరఖాస్తు చేసుకున్న వారు ఎక్కువగా ఉండడం, వారిని సమన్వయం చేసి అభ్యర్థులను ప్రకటించాల్సి ఉందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. ఈ కారణంగానే మొదటి జాబితాలో జిల్లాకు చోటు లభించలేదని తెలిపారు.

ఎవరికి వారే..

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గ్రూపు తగాదాలు కనిపిస్తున్నాయి. కొన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఎవరికి వారు విడిపోయి పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇలా నేతలు గ్రూపులుగా విడిపోయి ఒక్కో గ్రూపు ఒక్కొక్కరికి మద్దతు తెలుపుతుండటం, పైరవీలు చేస్తుండటంతో ఎవరిని ఎంపిక చేయాలనే సందిగ్ధ పరిస్థితితో అధిష్టానం ఉన్నట్లు సమాచారం. ఈ కారణంగానే మొదటి జాబితాలో అభ్యర్థులను ప్రకటించలేదని తెలిసింది.

పదుల సంఖ్యలో ఆశావహులు

జిల్లాలో బీజేపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసేందుకు పదుల సంఖ్యలో దరఖాస్తు చేశారు. అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ కంటే కూడా ఎక్కువ మంది బీజేపీ టికెట్ ఆశిస్తూ అర్జీ పెట్టుకున్నారు. ఇందులో స్థానికులతో పాటు స్థానికేతరులు ఉన్నారు. జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల నుంచి 60 మంది దరఖాస్తు చేసుకోవటం గమనార్హం.

ఎవరి ప్రయత్నాలు వారివే..

జిల్లాలోని ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు లేక ముగ్గురు పేర్లను పరిశీలన కోసం రాష్ట్ర నాయకత్వం అధిష్టానానికి పంపినట్లు సమాచారం. దరఖాస్తు చేయని వారు కూడా ముఖ్య నేతల ద్వారా టికెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. వికారాబాద్ నియోజకవర్గం నుంచి పీ నవీన్‌కుమార్, బాషా పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. పరిగి నుంచి బూనేటి మారుతి కిరణ్, పరమేశ్వర్‌రెడ్డి, ఈశ్వరప్ప పేర్లు అధిష్టానం వద్ద ఉన్నాయి. తాండూరు నుంచి సహదేవ్, విశ్రాంత పోలీసు అధికారి కృష్ణప్రసాద్ పేర్లను పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. కొడంగల్ నియోజకవర్గం నుంచి పూనం చంద్‌లపూల్, కూర వెంకటేశ్ పేర్లు పరిశీలిస్తున్నట్టు సమాచారం. అయితే వీరితో పాటు మరికొందరు ఆశావహులు సైతం ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు తెలిసింది.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం
- పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: బీఆర్‌ఎస్ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం పుట్టపహాడ్‌లో బూత్‌స్థాయి కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటైన తర్వాత దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు బూటకమని, వారి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆరోపించారు. కర్ణాటకలో వ్యవసాయ రంగానికి 7గంటల కరెంటే ఇస్తున్నారని, మనం 24గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ఆగమైపోతామని అన్నారు. బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్ నాయక్, రైతు బంధు మండల అధ్యక్షుడు రాజు, సొసైటీ వైస్ చైర్మన్ నాగరాజు, చౌడాపూర్ మండల అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షుడు మేగ్యనాయక్, ప్రధాన కార్యదర్శులు నర్సింలు, లక్ష్మయ్య, మండల కో ఆప్షన్ సభ్యులు జుబేర్, నాయకులు రామకృష్ణ, వెంకటేష్, నర్సింలు, యాదయ్య, మొగులయ్య, రాజు పాల్గొన్నారు.

ఎంపీపై దాడి అమానుషం

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేయడం అమానుషమని, ఇలాంటి ఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఎమ్మెల్యే అన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై ప్రత్యర్థి పార్టీకి చెందిన వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడటం దుర్మార్గపు చర్య అన్నారు. రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు, దాడులు సరికాదని హితవు పలికారు. ఓటమి భయంతోనే ప్రత్యర్థి పార్టీల నాయకులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఇలాంటి వాటిని సహించేది లేదన్నారు.

కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదు

- మారితే రాళ్లతో కొట్టండి
- తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

పెద్దేముల్: తాండూరు ప్రజలకు సేవ చేయడానికే వచ్చా.. కాంగ్రెస్ పార్టీలోనే ఉంటా.. గెలిచిన తరువాత పార్టీ మారితే రాళ్లతో కొట్టాలని కాంగ్రెస్ పార్టీ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గోట్లపల్లి, హన్మాపూర్, గిర్మాపూర్, జైరాం తండా, దారుణివాగు తండా, బండమీదిపల్లి, సిద్దన్న మడుగు తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. తాను పార్టీలు మారే వ్యక్తిని కాదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రాబోతుందని జోస్యం చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఏక కాలంలో లక్ష రూపాయల రైతు రుణ మాఫీ చేశారని, ఆయన తరహాలోనే కాంగ్రెస్ అధికారం చేపట్టగానే మొదటి సంతకం రూ. 2లక్షల రుణ మాఫీపైనే చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్ఆర్ అమలు చేసిన పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ గాలి వీస్తోందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని భూ కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. తాను ఏనాడు సుద్ద, ఇసుక అక్రమ రవాణా చేయలేదని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. తాను ప్రజలను మోసం చేసే వ్యక్తిని కాదన్నారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎన్ని డబుల్ బెడ్ రూమ్‌లు ఇచ్చారో, ఎంత మంది రైతులకు రుణమాఫీ చేశారోచెప్పాలని నిలదీశారు. మళ్లీ బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ధారాసింగ్, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, తాండూరు కాంగ్రెస్ పార్టీ ఏ- బ్లాక్ ప్రెసిడెంట్ లోంక నర్సింలు, సీనియర్ నాయకుడు మైపాల్‌రెడ్డి, మండల వైస్ ఎంపీపీ మధులత, మాజీ జెడ్పీటీసీ రాకేష్ నాయకులు మహరాజ్, మల్లేశం, రియాజ్, ఎల్లారెడ్డి, ప్రవీణ్‌కుమార్, మినాజ్, చంద్రప్ప, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

- కర్ణాటక నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఎస్పీ కోటిరెడ్డితో కలిసి కోత్లాపూర్ చెక్‌పోస్ట్ సందర్శన



తాండూరు రూరల్: కోత్లాపూర్ చెక్‌పోస్ట్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

తాండూరు రూరల్: ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, కర్ణాటక నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం మండలంలోని కోత్లాపూర్ చెక్‌పోస్ట్‌ను ఎస్పీ కోటిరెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. వాహన తనిఖీలను సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యేలా చూడాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎలక్షన్ కమిషనర్ కార్యాలయానికి అనుసంధానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ తారాసింగ్, డీఎస్పీ శేఖర్‌గౌడ్, సీఐ రాంబాబు, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, డీఏఓ మహేష్‌గౌడ్, ఆర్ఐ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని సౌకర్యాలు కల్పించాలి

వికారాబాద్ అర్బన్: జిల్లాలో ఎన్నికల పరిశీలకులకు పర్యటించనున్న నేపథ్యంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎస్పీ కోటిరెడ్డితో కలిసి హరిత రిసార్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పర్యటించనున్న ఎన్నికల అధికారుల కోసం అనంతగిరి గుట్టపై హరిత రిసార్టును సిద్ధం చేసినట్లు వివరించారు. ఇక్కడ మొబైల్ సిగ్నల్ తోపాటు, వై ఫై ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్, ఆర్అండ్‌బీ డీఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఎల్‌పీఓ శంకర్‌నాయక్, డీఆర్‌డీఓ అధికారులు స్టీవెన్ నిల్, నర్సింలు పాల్గొన్నారు.

హద్దులు దాటొద్దు

తాండూరు: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు హద్దులు దాటరాదని కలెక్టర్ సీ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం ఎస్పీ కోటిరెడ్డి, తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావులతో కలిసి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణంలోని సెయింట్ మార్క్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించారు. అనంతరం తాండూరు ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా పటిష్టం చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీల్లో ఇప్పటి వరకు రూ. 1.62కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆధారాలు, రసీదులు చూపిన వారికి రూ కోటి వరకు తిరిగి ఇచ్చేసినట్లు వివరించారు. కర్ణాటకలో ఓటు హక్కు ఉండి జిల్లాలో ఓటు పొందిన వారిని జాబితా నుంచి తొలగించడం జరిగిందన్నారు. మంగళవారంతో ఓటరు నమోదు ప్రక్రియ ముగిసిందన్నారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జిల్లాకు కేంద్ర బలగాలు వచ్చాయని తెలిపారు. జిల్లాలో అసెంబ్లీ బరిలో ఉన్న అభ్యర్థులకు భద్రత కల్పిస్తామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు ఇప్పటికే భద్రత ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్, సీఐలు రాంబాబు, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పటేల్ జయంతి

తాండూరు టౌన్: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని తాండూరు పట్టణ పోలీసు స్టేషన్ వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భారతీయులంతా ఒక్కటేనని, ఐకమత్యంతో ప్రశాంత జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావు, డీఎస్పీ శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోడ్ ఉల్లంఘిస్తే కొరడా

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్ రూరల్: రాజకీయ నాయకులు, అధికారులు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినేషన్లకు వచ్చే సమయంలో వాహనాల పరిమితి, పాటించాల్సి దూరం, స్వతంత్ర అభ్యర్థులు, బీ ఫాం కలిగిన అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈవీఎంల నిర్వహణ, నమూనా బ్యాలెట్ పేపర్, మాక్ పోలింగ్ తదితర అంశాలను అధికారులకు వివరించారు. అనంతరం డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు పోలీసులు, పీఓ, ఏపీఓలు పూర్తి భద్రత అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయ్‌కుమార్, తహసీల్దార్లు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో సెక్టోరియల్ అధికారుల పాత్ర చాలా కీలకమని వికారాబాద్ రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులు ఎఫ్ఎస్టీ, వీఎస్టీ, ఎస్ఎస్టీ, వీవీటీ టీంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెక్టోరియల్ అధికారులు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలైన విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, రాంపులతో పాటు కిటికీలు, తలుపులను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. నిబంధనల ప్రకారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికలను అన్ని టీంలు పర్యవేక్షిస్తుండాలని సూచించారు.

వలసలకు బ్రేక్

- అసంతృప్తులతో మంత్రి మంతనాలు సఫలం

తాండూరు రూరల్: అధికార బీఆర్ఎస్‌కు చెందిన ఓ బడా నాయకుడితో మంత్రి చేపట్టిన చర్చలు సఫలమయ్యాయి. మంగళవారం కొడంగల్‌లో ఎన్నికల ప్రచారానికి హాజరైన పట్నం మహేందర్‌రెడ్డి రాత్రికి తాండూరుకు చేరుకున్నారు. తన ప్రత్యేక వాహనంలో పార్టీ మారే యోచనలో ఉన్న నేత ఇంటికి వెళ్లి బుజ్జగించారు. పైలట్ గెలుపునకు పనిచేయాలని సూచించడంతో ఆయన మెత్తబడ్డారు. తన అనుచరులకు సైతం రోహిత్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చినట్లు సమాచారం .గులాబీ నేతలు తాండూరు నుంచి వలసలకు బ్రేక్ పడినట్లేనని చర్చించుకుంటున్నారు.

రూ.4.5లక్షలు సీజ్

చేవెళ్ల: ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిర్వహిస్తున్న పోలీస్ చెక్‌పోస్టులో రూ.4.5 లక్షల నగదు పట్టుబడినట్లు చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు. వివరాలిలా.. అంతారం చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఓ వ్యక్తి తన కారులో రూ.4.5 లక్షల నగదుతో వెళ్తుండగా పట్టుకున్నారు. అతని వద్ద నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవటంతో స్వాధీనం చేసుకున్నారు.

పరిగి బరిలో ప్రముఖులు



హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న పరిగి నియోజకవర్గం వినూత్న రాజకీయాలకు పెట్టింది పేరు. నూతనంగా ఏర్పడిన వికారాబాద్ జిల్లాలోని ఈ సెగ్మెంట్‌లో 14 సార్లు ఎన్నికలు జరగగా కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్ జెండాలు ఎగిరాయి.

ఒక్కొక్కరికి దశాబ్దాల పాటు అవకాశం

- ఐదు సార్లు ప్రాతినిథ్యం వహించిన కొప్పుల హరీశ్వర్‌రెడ్డి
- హ్యాట్రిక్ సాధించిన కమతం రాంరెడ్డి



కొప్పుల మహేశ్‌రెడ్డి | టి.రామ్మోహన్‌రెడ్డి | కొప్పుల హరీశ్వర్‌రెడ్డి | కమతం రాంరెడ్డి

ఓటర్ల వివరాలు

పురుషులు **1,27,835**

మహిళలు **1,24,537**

మొత్తం **2,52,379**

పరిగి: పరిగి నియోజకర్గంలో 1952 నుంచి నేటి వరకు 14 సార్లు ఎన్నికలు జరిగాయి. నియోజకవర్గం ఏర్పడిన మొదటి ఏడాది జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి షాజహాన్ బేగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సెగ్మెంట్ నుంచి ఏడు సార్లు హస్తం హవా కొనసాగించగా.. ఐదు సార్లు సైకిల్ సత్తాచాటింది. ఒక సారి కారు జోరు చూపింది. ప్రస్తుతం నియోజకవర్గంలో పరిగి, పూడూరు, దోమ, కుల్కచర్ల, గండీడ్, మహ్మదాబాద్, చౌడాపూర్ మండలాలున్నాయి. 305 పోలింగ్ స్టేషన్లకు గాను 2,52,379 మంది ఓటర్లున్నారు.

గుర్తింపు సాధించుకున్న నేతలు

నియోజకవర్గం ఉమ్మడి రాష్ట్రంలోనూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. పరిగి అనగానే కమతం రాంరెడ్డి, కొప్పుల హరీశ్వర్‌రెడ్డి పేర్లు వినిపిస్తాయి. కోట్ల విజయభాస్కర్ రెడ్డి ప్రభుత్వం కమతం మంత్రిగా పని చేసి ఓ వెలుగు వెలిగారు. టీడీపీ నుంచి గెలుపొందిన కొప్పుల డిప్యూటీ స్పీకర్‌గా తనదైన ముద్ర వేసుకున్నారు. 15 సార్లు శాసన సభ ఎన్నికలు నిర్వహించగా ప్రధానంగా ఏడుగురు మాత్రమే పోటీలో నిలిచారు. హరీశ్వర్‌రెడ్డి ఐదు సార్లు గెలుపొందగా.. మూడు పర్యాయాలు రాంరెడ్డి విజయం సాధించారు. రెండు సార్లు అహ్మద్‌షరీఫ్ మరో నలుగురు ఒక్కోసారి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. పరిగి నుంచి మంత్రివర్గంలో చోటు కోసం యత్నించిన దివంగత హరీశ్వర్‌రెడ్డి తన చిరకాల స్వప్నం నెరవేరకుండానే తుదిశ్వాస విడిచారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థిగా ఆయన కుమారుడు మహేశ్‌రెడ్డి రెండో సారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఎన్నికల పోరులో నిలిచారు.

దశాబ్దాల పాటు అవకాశం

ఇక్కడి ప్రజల తీర్పు విభిన్నంగా ఉంటుంది. 1985 నుంచి 2009 వరకు జరిగిన ఐదు ఎన్నికల్లో కొప్పుల హరీశ్వర్‌రెడ్డికే పట్టం కట్టారు. గతంలోనూ కాంగ్రెస్ నుంచి కమతం రాంరెడ్డి హ్యాట్రిక్ కట్టబెట్టగా.. అహ్మదర్ షరీఫ్‌ను రెండు ఎన్నికల్లో ఆశీర్వదించారు. అనంతరం 2014లో రాజకీయ చతురుడైన హరీశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. తదనంతరం అనారోగ్య సమస్యల కారణంగా 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి హరీశ్వర్‌రెడ్డి తనయుడు మహేశ్‌రెడ్డికి టీఆర్ఎస్ టికెట్ ఇవ్వడంతో ఆయన రామ్మోహన్‌రెడ్డిని ఓడించారు.

1952 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల వివరాలు

సంవత్సరం	విజేత	పార్టీ	పోలైన ఓట్లు	ఓడిన అభ్యర్థి	పార్టీ	పోలైన ఓట్లు
1952	షాజహాన్ బేగం	కాంగ్రెస్	ఏకగ్రీవం	-	-	-
1957	జగన్‌మోహన్‌రెడ్డి	స్వతంత్ర	10,676	వెంకటస్వామి	కాంగ్రెస్	6167
1962	ఎం. ఆర్ రెడ్డి	కాంగ్రెస్	16,494	సుదర్శన్	స్వతంత్ర	9520
1967	రాంరెడ్డి	స్వతంత్ర	21,087	అహ్మద్‌షరీఫ్	కాంగ్రెస్	20,237
1972	రాంరెడ్డి	కాంగ్రెస్	31,007	రాందేవ్‌రెడ్డి	స్వతంత్ర	18,278
1978	అహ్మద్‌షరీఫ్	స్వతంత్ర	32,4880	రాంరెడ్డి	కాంగ్రెస్	23,915
1983	అహ్మద్‌షరీఫ్	కాంగ్రెస్	25,751	హరీశ్వర్‌రెడ్డి	స్వతంత్ర	25,666
1985	హరీశ్వర్‌రెడ్డి	టీడీపీ	53,920	అహ్మద్‌షరీఫ్	కాంగ్రెస్	21,408
1989	రాంరెడ్డి	కాంగ్రెస్	52,368	హరీశ్వర్‌రెడ్డి	టీడీపీ	48,179
1994	హరీశ్వర్‌రెడ్డి	టీడీపీ	67,433	రాంరెడ్డి	కాంగ్రెస్	62918
1999	హరీశ్వర్‌రెడ్డి	టీడీపీ	60,360	రాంరెడ్డి	కాంగ్రెస్	51,744
2004	హరీశ్వర్‌రెడ్డి	టీడీపీ	59,809	రాంరెడ్డి	కాంగ్రెస్	52,161
2009	హరీశ్వర్‌రెడ్డి	టీడీపీ	53,099	రామ్మోహన్‌రెడ్డి	స్వతంత్ర	38,655
2014	రామ్మోహన్‌రెడ్డి	కాంగ్రెస్	68,098	హరీశ్వర్‌రెడ్డి	బీఆర్ఎస్	62,935
2018	మహేశ్‌రెడ్డి	టీఆర్ఎస్	82,941	రామ్మోహన్‌రెడ్డి	కాంగ్రెస్	66,541

సంక్షేమం దేశానికే ఆదర్శం



ఎన్నికల ప్రచారంలో పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి: తెలంగాణ సంక్షేమం దేశానికే ఆదర్శమని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పట్టణ కేంద్రంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని మూడోసారి ఆయన్ను హ్యాట్రిక్ సీఎం చేసేందుకు ప్రజలంతా పాటుపడాలన్నారు. ఇంటింటికీ బీఆర్ఎస్ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని గుర్తుచేశారు. కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదిస్తే సమస్యలు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు అర్చన, కిరణ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌కు నలుగురు ప్రధానులు

షాద్‌నగర్: నలుగురు దేశ ప్రధానులు షాద్‌నగర్‌ను సందర్శించారు. 1959 నుంచి 1978 వరకు దేశాన్ని పాలించిన ప్రధానమంత్రులు ఇక్కడకు విచ్చేశారు. 1959లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రి హోదాలో తొలుత రాగా.. అనంతరం ఇందిరా గాంధీ 1983లో ప్రధాని హోదాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అదేవిధంగా పీవీ నర్సింహారావు మూడుసార్లు సందర్శించగా ప్రధాని హోదాలో షాద్‌నగర్ మీదుగా కర్ణాటకకు వెలుతూ రైల్వే స్టేషన్‌లో దిగి కాసేపు కార్యకర్తలు, నేతలకు అభివాదం చేసి వెళ్లారు. 1978లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి మొరార్జీ దేశాయ్ ప్రధానిగా విచ్చేశారు.

రాష్ట్ర ఫలాలు రావుల కుటుంబానికే..



ప్రచారానికి విచ్చేసిన ప్రసాద్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న రావులపల్లి గ్రామస్తులు

మర్పల్లి: ప్రత్యేక రాష్ట్ర ఫలాలన్నీ రావుల కుటుంబమే అనుభవిస్తోందని మాజీ మంత్రి, కాంగ్రెస్ వికారాబాద్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోనలి తిమ్మాపూర్, రావులపల్లి, కుడుగుంట, గుర్రంగట్టు తండా, పెద్దాపూర్, కల్‌ఖోడ, శాపూర్, దామస్తాపూర్, దామస్తాపూర్ తండా, బూచన్‌పల్లి గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నాయకులు ఘన స్వాగతం పలికారు. పర్యటనలో ఆయన మాట్లాడుతూ.. హస్తం గుర్తుకు ఓటేసి ఆశీర్వదిస్తే అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి వికారాబాద్, మర్పల్లి మాజీ జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల గడ్డ.. ఉద్దండుల అడ్డా

నగరానికి కూత వేటు దూరంలో ఉన్న నియోజకవర్గం. పట్టణ, గ్రామీణ ప్రాంతాల కలబోతగా ఉండే ఈ సెగ్మెంట్ రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు. పటోళ్ల, పట్నం కుటుంబాలు ఐదు మండలాలను కంచుకోటగా మార్చుకున్నాయి. చేవెళ్ల గడ్డ.. రాజకీయ నేతలకు అడ్డాగా ప్రత్యేకత చాటుకుంటోంది. ఇక్కడ గెలిచిన అభ్యర్థులు రాజకీయాల్లో చక్రం తిప్పిన వారే.

విలక్షణ తీర్పు నియోజకవర్గ సొంతం

- ఉమ్మడి రాష్ట్రానికి ఉపముఖ్యమంత్రిని ఇచ్చిన సెగ్మెంట్
- 1959-62 వరకు డిప్యూటీ సీఎంగా కొండా వెంకటరంగారెడ్డి
- గెలిచి నిలిచిన పటోళ్ల కుటుంబం
- ఎక్కువ సార్లు గెలుపొందిన, అధిక మెజార్టీ సాధించిన నేతగా ఇంద్రారెడ్డి రికార్డు
- త్రిముఖ పోటీలో చక్రం తిప్పేదెవరో..?



చేవెళ్ల నియోజకవర్గ మ్యాప్



దిడిగె సత్యనారాయణ | ప్రతాపలింగం | కొండా లక్ష్మారెడ్డి

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం ఓటర్లు
నవాబుపేట	18,192	17,686	0	35,878
శంకర్‌పల్లి	31,065	30,987	0	62,052
మొయినాబాద్	28,520	27,124	01	55,645
షాబాద్	22,915	22,113	01	45,029
చేవెళ్ల	28,081	27,285	02	55,368
మొత్తం	1,28,773	1,25,195	04	2,53,972



ఇంద్రారెడ్డి | సబితారెడ్డి

చేవెళ్ల/మొయినాబాద్: స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1952లో మొదటిసారిగా శాసనసభ ఎన్నికలు జరిగాయి. మొదటి ఎన్నికలు నిర్వహించినప్పుడు షాబాద్ పేరుతో నియోజకవర్గం ఉండేది. 1952లో జరిగిన ఎన్నికల్లో కొండా వెంకట రంగారెడ్డి విజయం సాధించారు. 1957 ఎన్నికల్లో షాబాద్ నియోజకవర్గం ద్విసభ్య నియోజకవర్గంగా ఉంది. అప్పుడు వి.రామారావు, కొండా వెంకట రంగారెడ్డి ఇద్దరు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. కొండా వెంకట రంగారెడ్డి ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తరువాత 1962లో చేవెళ్ల నియోజకవర్గం చేవెళ్ల కేంద్రంగా ఏర్పాటయింది.

పట్టు సాధించిన 'పటోళ్ల'

అనంతరం 1957లో జరిగిన సాధారణ ఎన్నికల్లో చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. ఒక ఉప ఎన్నికతో కలిపి ఇప్పటి వరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో ఒక్కసారి స్వతంత్ర అభ్యర్థి గెలుపొందగా తొమ్మిదిసార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ, జనతా, టీఆర్ఎస్‌లు ఒక్కోసారి జెండా ఎగురవేశాయి. 1967లో దిడిగె సత్యనారాయణ ఇండిపెండెంట్‌గా విజయం సాధించగా.. దివంగత మంత్రి పటోళ్ల ఇంద్రారెడ్డి అత్యధికంగా నాలుగుసార్లు విజయం సాధించి చరిత్రకెక్కారు. 1985, 1989, 1994లో టీడీపీ నుంచి పోటీ చేసిన ఆయన వరుసగా 24,713, 47,289, 20,384 ఓట్ల మెజార్టీ సాధించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం జై తెలంగాణ పార్టీని స్థాపించారు. రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ సుముఖత వ్యక్తం చేయడంతో ఆయన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. 1999లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఆయన ప్రత్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్ఆర్)పై 63,299 భారీ మెజార్టీతో విజయకేతనం ఎగురవేశారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ రికార్డు ఆయనకే దక్కింది. ఆ తరువాత రెండు పర్యాయాలు వి.రామారావు, రెండుసార్లు మాజీ హోంమంత్రి పి.సబితారెడ్డి, రెండు సార్లు కాలె యాదయ్య నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఎమ్మెల్యేగా ఉన్న ఇంద్రారెడ్డి 2000 ఏప్రిల్ 22న పాల్మాకుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో మొదటిసారి ఉప ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికలో సబితారెడ్డి ఆయన వారసురాలిగా అరంగేట్రంచేసి భారీ మెజారిటీతో విజయం సాధించారు. అనంతరం 2004 ఎన్నికలోనూ సబితారెడ్డి హస్తం గుర్తుపై పోటీ చేసిన ఆమె టీడీపీ అభ్యర్థి సామ భూపాల్‌రెడ్డిపై 41,585 ఓట్ల మెజార్టీతో రెండో సారి గెలుపొందారు.



కాలె యాదయ్య | కెఎస్. రత్నం | భీంభరత్

త్రిముఖ పోటీ

2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ మరోమారు కాలె యాదయ్యకు అవకాశం కల్పించింది. కాంగ్రెస్ ప్రకటించిన లిస్టులో భీంభరత్‌కు అవకాశం దక్కింది. ఇటీవలే కమలం గూటికి చేరిన కేఎస్ రత్నంకే బీజేపీ టికెట్ వస్తుందని ప్రచారం సాగుతోంది. వీరు ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

2009 నుంచి ఎస్సీ రిజర్వ్

చేవెళ్ల నియోజకవర్గం 2009 ముందు జనరల్ స్థానంగా ఉండేది. అప్పట్లో ఈ నియోజకవర్గం పరిధిలో చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, శంషాబాద్, రాజేంద్రనగర్, ప్రస్తుత గండిపేట మండలం ప్రాంతాలు ఉండేవి. 2009 ఎన్నికలకు ముందు నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. డీలిమిటేషన్‌లో భాగంగా చేవెళ్ల, మొయినాబాద్,శంకర్‌పల్లి, షాబాద్, నవాబ్‌పేట మండలాలను కలిపి చేవెళ్ల నియోజకవర్గంగా ఏర్పాటు చేసి ఎస్సీ రిజర్వేషన్ కల్పించారు. 2009లో టీడీపీ నుంచికేఎస్ రత్నం, కాంగ్రెస్ నుంచి కాలె యాదయ్య పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో రత్నం ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో జరిగిన ఎన్నికల్లో కేఎస్.రత్నం టీఆర్ఎస్ నుంచి పోటీ చేయగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కాలె యాదయ్య విజయం సాధించారు. అనంతరం ఆయన గులాబీ గూటికి చేరి టీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కేఎస్ రత్నం ఓటమి పాలయ్యారు.

నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించిన ఎమ్మెల్యేలు

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ
1952	కేవీ రంగారెడ్డి	స్వతంత్ర
1957	వి.రామారావు	కాంగ్రెస్
ద్విసభ్య	కేవీ రంగారెడ్డి	కాంగ్రెస్
1962	వి.రామారావు	కాంగ్రెస్
1967	డి.సత్యనారాయణ	స్వతంత్ర
1972	పి.కిషన్‌రావు	కాంగ్రెస్
1978	సి.ప్రతాప్‌లింగం	జనతా
1983	కె.లక్ష్మారెడి	కాంగ్రెస్
1985	పి.ఇంద్రారెడ్డి	టీడీపీ
1989	పి.ఇంద్రారెడ్డి	టీడీపీ
1994	పి.ఇంద్రారెడ్డి	టీడీపీ
1999	పి.ఇంద్రారెడ్డి	కాంగ్రెస్
2000	పి.సబితారెడ్డి	కాంగ్రెస్
2004	పి.సబితారెడ్డి	కాంగ్రెస్
2009	కేఎస్.రత్నం	టీడీపీ
2014	కాలె యాదయ్య	కాంగ్రెస్
2018	కాలె యాదయ్య	టీఆర్ఎస్